సాక్షి
పార్వతీపురం మన్యం

ఆదివారం । 21 । సెప్టెంబర్ । 2025



వేగుచుక్క.. 'గురజాడ'

విజయనగర ఖ్యాతిని దశ దిశలా చాటిన మహానుభావుడు గురజాడ. విద్యలనగరంలో సాహితీ సౌరభాలను కురిపించారు. ఆధునిక ఆంధ్ర సాహిత్యంలో వేగుచుక్కలా మెరిసారు. -IIలో



ప్రతి ఒక్కరూ చెట్లను దత్తత తీసుకోవాలి -IIలో

ప్రతి ఒక్కరూ మొక్కలను పెంచాలని కలెక్టర్ ఎస్.రామసుందరరెడ్డి సూచించారు.



వీర మహిళలను ఆపేదెవడ్రా..!

సమాజంలో కులదూషణ, అణచివేతను ప్రశ్నించేందుకు వచ్చిన జనసేన పార్టీలో వీర మహిళలే కుల దూషణ కేసుపై పోలీసుస్టేషన్ మెట్లు ఎక్కారు. -IIలో

న్యూస్‌రీల్

మొక్కలే మనకు ప్రాణదాతలు

● కలెక్టర్ డా.ఎన్.ప్రభాకర్ రెడ్డి



కలెక్టర్ కార్యాలయం ఆవరణలో మొక్క నాటి నీళ్లు పోస్తున్న కలెక్టర్

పార్వతీపురం రూరల్: మొక్కలే మనకు ప్రాణదాతలని కలెక్టర్ డాక్టర్ ఎస్.ప్రభాకర్ రెడ్డి అన్నారు. స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్రలో భాగంగా కలెక్టర్ కార్యాలయం ఆవరణలో శనివారం మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణతో పాటు భూమిపై కాలుష్యాన్ని తగ్గించి ప్రాణవాయువు అందించేందుకు మొక్కలు దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో జేసీ సి.యశ్వంత్‌కుమార్ రెడ్డి, డీఆర్వో కె.హేమలత, జిల్లా రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఎస్సీ విభాగం కార్యదర్శిగా వెంకటరమణ

సాక్షి, పార్వతీపురం మన్యం: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఎస్సీ విభాగం కార్యదర్శిగా పార్వతీపురం నియోజకవర్గానికి చెందిన బుత్తల వెంకటరమణ నియమితులయ్యారు. వైఎస్సార్‌సీపీ జాతీయ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు నియామకం చేసినట్టు పార్టీ కేంద్ర కార్యాలయం శనివారం ఓ ప్రకటనలో పేర్కొంది.

కూనేరు చెక్‌పోస్టు తనిఖీ



కూనేరు చెక్‌పోస్టు వద్ద రికార్డులు పరిశీలిస్తున్న సీఐ రంగనాథం

కొమరాడ: ఆంధ్రా–ఒడిశా సరిహద్దులోని కూనేరు చెక్‌పోస్టును సీఐ పి.రంగనాథం శనివారం తనిఖీ చేశారు. ఒడిశా నుంచి జిల్లాలోకి వచ్చే ప్రతీవాహనాన్ని నిశితంగా పరిశీలించాలని పోలీస్ సిబ్బందికి సూచించారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపే వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. చెక్ పోస్టులోని రికార్డులు పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయన వెంట ఎస్ఐ కె.నీలకంఠం, సిబ్బంది ఉన్నారు.

కీచక అధ్యాపకుడు..!

విజయనగరం అర్బన్: విద్యాబుద్ధులు నేర్పాల్సిన ఓ అధ్యాపకుడు కీచకబుద్ధిని ప్రదర్శించాడు. పీజీ ఉత్తీర్ణత ధ్రువపత్రాన్ని తీసుకునేందుకు విజయనగరం కేంద్రీయ గిరిజన యూనివర్సిటీకి వచ్చిన విద్యార్థినిపై లైంగిక వేధింపులకు గురిచేశాడు. మాయమాటలతో పరీక్షల నియంత్రణ విభాగంలోకి తీసుకెళ్లి అకృత్యంగా ప్రవర్తించాడు. రెండు రోజుల కిందట జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఇది ఇప్పుడు జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. అధ్యాపకుడి తీరుపై వర్సిటీ అధికారులకు విద్యార్థిని ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోకపోవడంపై విద్యార్థి వర్గాలు భగ్గుమంటున్నాయి. అధ్యాపకుడి కీచక పర్వాన్ని బహిరంగంగానే ఆక్షేపిస్తున్నాయి. తక్షణమే అధ్యాపకుడిని విధుల నుంచి తప్పించాలని డిమాండ్ చేస్తున్నాయి. లేదంటే బాధితురాలితో కలిసి పోరుబాట సాగిస్తామని హెచ్చరించాయి.

రిజిస్ట్రేషన్ కార్యాలయాలు వెలవెల..



మూతబడిన దస్తావేజు లేఖర్ల కార్యాలయాలు

విజయనగరం రూరల్: రిజిస్ట్రేషన్ ప్రక్రియలో ప్రభుత్వ నిబంధనలకు నిరసనగా దస్తావేజు లేఖర్లు రెండు రోజులుగా చేపడుతున్న పెన్‌డౌన్‌తో జిల్లాలో ని 11 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్లు అరకొరగా సాగాయి. నిరసన కార్యక్రమం చేపట్టిన తొలిరోజు శుక్రవారం జిల్లాలోని 11 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో 54 దస్తావేజులకు మాత్రమే రిజిస్ట్రేషన్లు జరిగాయి. వీటిలో చీపురుపల్లి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో 26 రిజిస్ట్రేషన్లు జరగ్గా, బొబ్బిలిలో 21 జరిగాయి. విజయనగరం పశ్చిమ, భోగాపురం, రాజాం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రెండేసి రిజిస్ట్రేషన్లు జరిగాయి. తెర్లాం, విజయనగరం ఆర్‌ఓ, నెల్లిమర్ల, ఎస్.కోట, గజపతినగరం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఒక్క రిజిస్ట్రేషన్ జరగలేదు. కొత్తవలసలో ఒక రిజిస్ట్రేషన్ జరిగింది. రెండో రోజైన శనివారం కేవలం 8 రిజిస్ట్రేషన్లే జరిగాయి. తెర్లాంలో 3, విజయనగరం ఆర్‌ఓలో 2, రాజాం, చీపురుపల్లి, కొత్తవలస కార్యాలయాల్లో ఒక్కోటి జరగ్గా, 6 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఒక్క రిజిస్ట్రేషన్ జరగలేదు. రెండు రోజుల్లో రిజిస్ట్రేషన్ శాఖకు స్టాంప్ డ్యూటీ రూపంలో కేవలం రూ.20 లక్షల ఆదాయం మాత్రమే లభించింది.

ఐటీడీఏలో డబ్బులిస్తే..
ఏదైనా రైట్ రైట్!

● ఆరోపణలున్న ఉపాధ్యాయులకు పోస్టింగులు

● డిప్యుటేషన్లు వేయాలన్నా ప్రమోషన్లు ఇవ్వాలన్నా లంచాలు



సాక్షి, పార్వతీపురం మన్యం:

గిరిజనాభివృద్ధికి పాటుపడాల్సిన పార్వతీపురం ఐటీడీఏలో లంచావతారులు అధికమవుతున్నారు. లంచాలకు ఆశపడి.. లేనిది ఉన్నట్లు, ఉన్నది కనికట్టు చేసి చూపించేయడంలో ఇక్కడ కొంతమంది సిద్ధహస్తులుగా మారారన్న విమర్శలున్నాయి. తరచూ ఇక్కడ జరుగుతున్న పరిణామాలు దీనికి బలాన్ని చేకూర్చుతున్నాయి. చాలాకాలంగా రెగ్యులర్ పీవో లేకపోవడంతో అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. గిరిజనాభివృద్ధి, సంక్షేమానికి పూర్తిగా తూట్లు పొడుస్తూ.. కేవలం సంపాదనకే పరిమితమయ్యారన్న ఆరోపణలు గిరిజన సంఘాల నుంచి వినిపిస్తున్నాయి.

విచారణలు తూతూమంత్రం..

గుమ్మలక్ష్మీపురం మండలం రేగిడి గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో వైద్యం పేరిట పురుష ఉపాధ్యాయులు బాలికలను బయటకు, ప్రైవేట్ ఆస్పత్రికి, ఆర్ఎంపీ వద్దకు గుట్టుగా వైద్యం కోసం తీసుకెళ్లడం గతంలో వివాదస్పదమైన విషయం విదితమే. ఈ క్రమంలో ఇక్కడి హెచ్‌ఎంపై తీవ్రస్థాయిలో ఆరోపణలు వచ్చాయి. బాలికల తల్లిదండ్రులు అధికారులకు కూడా ఫిర్యాదు చేశారు. అప్పట్లో ఆయనపై తాత్కాలిక చర్యలు తీసుకున్నా... ఐటీడీఏ అధికారులు ఆ కేసును నీరుగార్చి, తిరిగి మళ్లీ కొద్దిరోజులకే మరోచోట పోస్టింగ్ ఇవ్వడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ క్రమంలో పెద్ద ఎత్తున నగదు చేతులు మారినట్లు వినిపిస్తోంది. ఐటీడీఏలో ఓ అధికారిణి, కురుపాం నియోజకవర్గానికి చెందిన ప్రజాప్రతినిధి హస్తం ఇందులో ఉన్నట్లు ఆరోపణలున్నాయి. సదరు ఉపాధ్యాయునిపై కేసు విచారణ నివేదిక ఇప్పటికీ బహిర్గతం చేయకపోవడం గమనార్హం. స్వయంగా ముగ్గురు సభ్యులతో వేసిన కమిటీకి పిల్లల తల్లిదండ్రులు.. జరిగిన విషయాన్ని లిఖితపూర్వకంగా రాసి ఇచ్చినప్పటికీ, అది బుట్టదాఖలే అయినట్లు కనిపిస్తోంది. కొన్ని ఆరోపణలు నిజమేనని, మరికొన్ని తప్పుడవిగా నిర్ధారించేసి.. కేవలం రెండు ఇంక్రిమెంట్లలో కోత పెడుతూ.. తిరిగి అతనికి పోస్టింగ్ ఇచ్చేస్తూ, డీడీ ఉత్తర్వులు ఇచ్చేశారు. గతంలో సాలూరు నియోజకవర్గంలో పని చేస్తున్న మరో ఉపాధ్యాయునికీ ఇదే తరహాలో ఆరోపణలు వచ్చినా.. క్లీన్ చిట్ ఇచ్చి పోస్టింగ్ ఇచ్చేయడం గమనార్హం. ఇలా వివిధ ఆరోపణలపై విచారణలన్నింటినీ నీరుగార్చేస్తున్నారు. తమకు డబ్బులిస్తే.. ఏ పనైనా 'రైట్ రైట్' అన్నట్లు వ్యవహరిస్తున్నారు.

డిప్యుటేషన్లు వేయాలంటే.. పంట పండినట్లే

పార్వతీపురం ఐటీడీఏకు చాలాకాలంగా రెగ్యులర్ డీడీ లేరు. ప్రస్తుతం ఉన్న ఇన్‌చార్జి డీడీపై అనేక ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అర్హత లేకున్నా.. ఆ పోస్టులో కూటమి నేతలు కూర్చోబెట్టారని గిరిజన సంఘ నాయకులు ఆరోపిస్తున్నారు. డీడీ.. కేవలం తన వర్గానికి చెందిన వారికే పనులు చేస్తున్నారని గతంలోనూ పలువురు ఫిర్యాదు చేశారు. రెగ్యులర్ డీడీ లేకపోవడం వల్ల పర్యవేక్షణ కొరవడుతోందన్న విమర్శలున్నాయి. దీని వల్ల గిరిజన విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని.. కొన్ని గిరిజన సమస్యలు పరిష్కారం కావడం లేదని ఆయా సంఘాల నాయకులు చెబుతున్నారు. కనీస నిబంధనలు పాటించకుండా వసతిగృహ సంక్షేమాధికారుల నియామకం.. ఉపాధ్యాయుల డిప్యుటేషన్లు చేపట్టేస్తున్నారని అంటున్నారు. గతంలో నాలుగో తరగతి ఉద్యోగులు కొంతమందికి వసతిగృహ సంక్షేమాధికారులుగా ఉద్యోగోన్నతులు లభించాయి. ఇందులో ఎక్కడా నిబంధనలు పాటించలేదు. ఎల్ఎఫ్ హెచ్‌ఎం ప్రమోషన్లలో ఆర్డర్లు ఇవ్వడానికి డబ్బులు వసూలు చేశారన్న ఫిర్యాదులు సంఘాల నుంచి వచ్చాయి. ఒక్కొక్కరి వద్ద రూ.6 వేలు చొప్పున వసూలు చేసినట్లు ఆరోపణలున్నాయి. ప్రస్తుతం 50 వరకు రెగ్యులర్ హెచ్‌డబ్ల్యూవోలు లేరు. నాలుగో తరగతి ఉద్యోగులకు ప్రమోషన్లు ఇచ్చి డిప్యుటేషన్లు వేస్తున్నారు. డిప్యూటీ వార్డెన్ల నియామకంలోనూ పెద్ద ఎత్తున వసూలు చేస్తున్నట్లు వినిపిస్తోంది. ప్రధానంగా డీడీ సెక్షన్‌లో ప్రతి పనికీ లంచం ఇవ్వాలన్న అనధికార నిబంధన ఇక్కడ అమలవుతోంది. మరో ఇంజినీరింగ్ అధికారిపై అనేక అవినీతి ఆరోపణలు వస్తున్నా.. యథేచ్ఛగా సదరు వ్యక్తికి పోస్టులో కొనసాగిస్తున్నారు. దాదాపు ఏడాది నుంచీ ఐటీడీఏకు రెగ్యులర్ పీవో లేరు. ఇన్‌ఛార్జితోనే నెట్టుకొస్తున్నారు. దీనివల్ల ఇక్కడి పాలన పూర్తిగా గాడి తప్పింది. ఎవరికి వారు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం ఐటీడీఏ పీఓగా అదనపు బాధ్యతలను జేసీ యశ్వంత్‌కుమార్ రెడ్డి చేపట్టారు. ఆయన స్పందించి ఐటీడీఏ పాలనను గాడిలో పెట్టాలని గిరిజన సంఘాలు కోరుతున్నాయి.

పర్యవేక్షణ గాలికి..

పార్వతీపురం ఐటీడీఏ పరిధిలో 55 గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు ఉన్నాయి. వేసవి సెలవులు ముగిసి దాదాపు మూడు నెలలు కావస్తున్నప్పటికీ.. ఇంత వరకు ఏ పాఠశాలకూ గిరిజన సంక్షేమ అధికారులు సందర్శించిన దాఖలాలు లేవు. మరోవైపు పాఠశాలల్లో విద్యార్థులు జ్వరాల బారిన పడుతున్నారు. ఒక్క కురుపాం నియోజకవర్గంలోనే నలుగురు వరకు విద్యార్థులు మృతి చెందారు. అధికారులు కార్యాలయాలకే పరిమితమవుతూ.. అడ్డగోలు డిప్యుటేషన్లు, ప్రమోషన్లపైనే దృష్టి సారిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి.



పార్వతీపురం ఐటీడీఏ కార్యాలయం

మంత్రి సంధ్యారాణి మాకొద్దు



గిరిజన నిరుద్యోగ యువతను అడ్డుకుంటున్న పోలీసులు

● గిరిజనులకు న్యాయం చేయలేని వ్యక్తికి గిరిజన మంత్రి పదవి వృథా అంటూ నినాదాలు

● మంత్రి క్యాంపు కార్యాలయం ముట్టడికి ప్రయత్నించిన నిరుద్యోగులు

● పలువురిని స్టేషన్‌కు తరలించి విడిచిపెట్టిన పోలీసులు



మంత్రి సంధ్యారాణి రాజీనామా చేయాలంటూ నినదిస్తున్న గిరిజన నిరుద్యోగ యువత

సాలూరు: ఏజెన్సీ ప్రాంత ప్రజల హక్కులు, చట్టాలు కాలరాయబడుతున్నా కాపాడలేని గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి మాకొద్దని, తక్షణమే రాజీనామా చేయాలని గిరిజన నిరుద్యోగులు డిమాండ్ చేశారు. జీఓ 3 చట్టబద్ధతలో నిర్లక్ష్యం, మెగా డీఎస్సీలో ఆదివాసీలకు జరిగిన అన్యాయంపై నిరసిస్తూ గిరిజన నిరుద్యోగుల సంఘం, ఆదివాసీ డీఎస్సీ సాధన కమిటీ ఆధ్వర్యంలో శనివారం సాలూరులోని గిరిజన మంత్రి క్యాంప్ ఆఫీసు ముట్టడి కార్యక్రమాన్ని తలపెట్టారు. పార్వతీపురం, సీతంపేట, పాడేరు ఐటీడీఏల పరిధిలోని గిరిజన నిరుద్యోగ యువత బృందాలుగా వస్తున్నారన్న సమాచారంతో పోలీసులు, ప్రత్యేక బలగాలు పట్టణంలోని ప్రధాన కూడళ్లలో మోహరించాయి. సుమారు 20 మంది నిరుద్యోగులను అదుపులోకి తీసుకున్నారు. 15 మందిని స్టేషన్‌కు తరలించి తర్వాత విడిచిపెట్టారు. ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజన నిరుద్యోగ యువకులకు టీడీపీ ప్రభుత్వం మోసం చేసిందని ఆరోపించారు. మెగా డీఎస్సీలో గిరిజన యువతకు 2 వేల ఉపాధ్యాయ ఉద్యోగాలు కేటాయించినట్లు మంత్రి సంధ్యారాణి పాడేరులో చెప్పారని, ఇప్పుడు ఏజెన్సీ ప్రాంతంలోని ఉద్యోగాలన్నీ గిరిజనేతరులకే దక్కాయన్నారు. తమ ఓట్లతో ఎన్నికైన గిరిజన ఎమ్మెల్యేలు, మంత్రి అసెంబ్లీలో తమ సమస్యలపై ప్రస్తావించకుండా మౌనంగా ఉండడంపై మండిపడ్డారు. రానున్న రోజుల్లో క్షేత్రస్థాయిలో మంత్రిను అడ్డుకుంటామని స్పష్టంచేశారు.

రెవెన్యూ కోర్టులు నిర్వహించండి

● కలెక్టర్ డాక్టర్ ఎన్.ప్రభాకర్ రెడ్డి

పార్వతీపురం రూరల్: గ్రామాల్లో రెవెన్యూ కోర్టులు నిర్వహించి రెవెన్యూపరమైన కేసులను పరిష్కరించాలని కలెక్టర్ డా.ఎన్. ప్రభాకర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సబ్ కలెక్టర్లతో టెలీకాన్ఫరెన్స్‌లో శనివారం మాట్లాడారు. పిటీషనర్లను కార్యాలయానికి పిలిపించకుండా వారి వద్దకే వెళ్లి క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం న్యాయం చేయాలన్నారు. రెవెన్యూ కోర్టులు గ్రామాల్లో నిర్వహించడం వల్ల కేసులు త్వరితగతిన పరిష్కరించడానికి అవకాశం ఉంటుందన్నారు. జిల్లాలో ఉన్న రెండు డివిజన్లలో 120 కేసులు సబ్‌కలెక్టర్ల వద్ద నమోదయ్యాయని, వాటన్నింటినీ మూడు నెలల్లోగా పరిష్కరించాలని ఆదేశించారు. టెలీకాన్ఫరెన్స్‌లో పార్వతీపురం, పాలకొండ సబ్‌కలెక్టర్లు ఆర్.వైశాలి, పవర్ స్వప్నిల్ జగన్నాథ్ పాల్గొన్నారు.

పర్యాటక ప్రాంతాల గుర్తింపునకు పోటీలు

జిల్లాలో పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు అవకాశమున్న ప్రాంతాలు, జలపాతాల వ్యూపాయింట్స్, చారిత్రాత్మక, ఆసక్తికర ప్రదేశాలు, కట్టడాలు, ప్రకృతి రమణీయమైన ప్రాంతాలను నిమిషం నిడివితో చిత్రీకరించే వీడియోలను పంపించాలని కలెక్టర్ డాక్టర్ ఎస్.ప్రభాకరరెడ్డి జిల్లా ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ నెల 30వ తేదీలోగా (మన్యం పబ్లిసిటీఎట్‌దరేటాఫ్‌జీమెయిల్.కమ్) వెబ్‌సైట్‌కు పంపాలన్నారు. ఉత్తమ వీడియోలకు దసరా ఉత్సవాల వేడుకల్లో ప్రథమ బహుమతిగా రూ.5వేలు, ద్వితీయ బహుమతిగా రూ. 3వేలు, తృతీయ బహుమతిగా రూ.2వేలు నగదును అందజేస్తామన్నారు.

నిఘా నీడలో
కోటదుర్గమ్మ ఉత్సవాలు

● డ్రోన్‌లతో పర్యవేక్షణ

● 200 మంది పోలీసులతో బందోబస్తు



మాట్లాడుతున్న డీఎస్పీ రాంబాబు, సీఐ ప్రసాద్, ఎస్సై ప్రయోగమూర్తి

పాలకొండ: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం పాలకొండ కోటదుర్గమ్మ దసరా శరన్నవరాత్రి ఉత్సవాలకు 200 మంది పోలీసులతో పటిష్టబందోబస్తు ఏర్పాటుచేసినట్టు డీఎస్పీ ఎం.రాంబాబు తెలిపారు. శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో బందోబస్తు వివరాలను వెల్లడించారు. ఇప్పటికే పట్టణంలో 100 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని, ఆలయం పరిసరాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈ తొమ్మిది రోజుల పాటు డ్రోన్ కెమెరాతో నిఘా ఉంచుతామన్నారు. దసరా ఉత్సవాలు ఈ నెల 22 నుంచి వచ్చేనెల 3 వరకు సాగుతాయని, ట్రాఫిక్ ఆంక్షలను అమలు చేస్తామన్నారు. తొమ్మిది రోజుల పాటు భారీ వాహనాలను పట్టణంలోని అనుమతించకుండా పార్వతీపురం, రాజాం, శ్రీకాకుళం రోడ్లకు మళ్లిస్తామన్నారు. అమ్మవారి దర్శనానికి వచ్చేవారి వాహనాలను ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో పార్కింగ్ ఏర్పాటు చేశామన్నారు.

పిడుగుపాటుకు మహిళ మృతి



మృతిచెందిన చెల్లమ్మ

శృంగవరపుకోట: పిడుగుపాటుకు గురై సింబోయిన చెల్లమ్మ(45) అనే మహిళ శనివారం సాయంత్రం మృతి చెందింది. వివరాల్లోకి వెళ్తే... సింబోయిన కొత్తయ్య, చెల్లమ్మ దంపతులు ఎస్.కోట డంపింగ్‌యార్డు వెనుక ప్రాంతంలో నివసిస్తున్నారు. కొండపై సుద్దగరువు ప్రాంతంలో పోడు వ్యవసాయం చేస్తున్నారు. రోజూ మాదిరిగా పోడు వ్యవసాయానికి వెళ్లిన చెల్లమ్మ రాత్రి 7.30 గంటల వరకు ఇంటికి రాలేదు. ఇరుగుపొరుగు వారు పోడు వద్దకు వెళ్లి చూసేసరికి పాకలో చెల్లమ్మ మృతిచెంది ఉంది. సాయంత్రం 5.30 గంటల సమయంలో పిడుగులు పడడంతో మృతిచెంది ఉంటుందని స్థానికులు చెబుతున్నారు.

పైడితల్లి పండగ మధురస్మృతిగా నిలవాలి



మాట్లాడుతున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్, కలెక్టర్ ఎస్.రామసుందర్‌రెడ్డి

విజయనగరం అర్బన్: పైడితల్లి అమ్మవారి పండగ, ఈ సందర్భంగా నిర్వహిస్తున్న విజయనగరం ఉత్సవాలు ప్రతి ఒక్కరి మదిలో మధుర స్మృతిగా నిలిచిపోవాలని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. ఉత్సవాల ఏర్పాట్లపై కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంత్రి శనివారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పండగ కోసం నగరమంతా సుందరీకరణ చేయాలని, రోడ్లపై గుంతలు లేకుండా చూడాలని, అతిథుల ప్రొటోకాల్ సక్రమంగా నిర్వర్తించాలని అధికారులను ఆదేశించారు. పైడితల్లి దర్శనానికి వచ్చే భక్తులకు ఇబ్బంది లేకుండా బస్సు సర్వీసులు నడపాలన్నారు. కార్యక్రమంలో ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే అధితి గజపతిరాజు, కలెక్టర్ ఎస్.రామసుందర్‌రెడ్డి, జేసీ సేతుమాధవన్, డీఆర్వో శ్రీనివాసమూర్తి, అదనపు ఎస్పీ సౌమ్యలత, శిరీష తదితరులు పాల్గొన్నారు.

28 నుంచి సరస్ ఎగ్జిబిషన్

విజయనగరం ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 28 నుంచి అఖిలభారతి డ్వాక్రా ఉత్పత్తుల ప్రదర్శన సరస్ ఎగ్జిబిషన్ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఎస్.రామసుందర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. 18 రాష్ట్రాలకు చెందిన 220 స్టాల్స్ ఏర్పాటుకు వీలుగా మాన్సాస్ గ్రౌండ్‌ను సిద్ధం చేయాలని చెప్పారు.

ఇద్దరు ఉపాధ్యాయులు సస్పెన్షన్

మెంటాడ: మద్యం తాగి పాఠశాల విధులకు హాజరవుతున్నారంటూ కుంటినవలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రామకృష్ణ, లెక్కల ఉపాధ్యాయుడు వెంకటగిరిపై గ్రామస్తులు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. దీనిపై విచారణ జరిపిన సమయంలో డిప్యూటీ ఈఓ మోహనరావు సమక్షంలోనే హెచ్‌ఎం మద్యం తాగి వీరంగం సృష్టించారు. దీనిపై డిప్యూటీ ఈఓ ఇచ్చిన నివేదిక ఆధారంగా హెచ్‌ఎం రామకృష్ణ, లెక్కల ఉపాధ్యాయుడు వెంకటగిరిని శనివారం సస్పెండ్ చేసినట్టు డీఈఓ మాణిక్యంనాయుడు తెలిపారు.

యూరియా కోసం రైతన్నల పాట్లు



బాడంగిలో ఎరువుల షాపువద్ద గుమికూడిన రైతులు

బాడంగి: యూరియా కోసం రైతన్నకు పాట్లు తప్పడం లేదు. ప్రైవేటు దుకాణాల వద్ద గంటల తరబడి నిరీక్షిస్తున్నారు. పాల్తేరులో ఆర్డీఓ రామమోహన్‌రావు, తహసీల్దార్ వరప్రసాద్, వ్యవసాయ సిబ్బంది సమక్షంలో యూరియా పంపిణీ చేయగా... బాడంగి మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు దుకాణంలో ఇద్దరు రైతులకు ఒక బస్తా చొప్పున పంపిణీ చేశారు.

ఆశలపై నీళ్లు



సమస్యలు పరిష్కరించాలంటూ రాజాంలో నిరసన తెలుపుతున్న ఆశ కార్యకర్తలు (ఫైల్)

● వేతనపెంపు హామీ ఇచ్చి వదిలేసిన కూటమి ప్రభుత్వం

● పనిభారంతో సతమతమవుతున్న కార్యకర్తలు

● ఉద్యోగ భద్రతకోసం నిత్య పోరాటాలు

రాజాం:

ఆశ కార్యకర్తలకు కనీస వేతనం అమలుచేస్తాం.. ఉద్యోగ భద్రత కల్పిస్తాం.. పనిభారాన్ని తగ్గిస్తాం అంటూ ఎన్నికలకు ముందు కూటమి నేతలు హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చాక వారి 'ఆశ'లపై నీళ్లుచల్లడంతో మండిపడుతున్నారు. నెలకు రూ.26వేల వేతనం చెల్లిస్తామని చెప్పి మోసం చేశారని వాపోతున్నారు. ఖాళీగా ఉన్న ఆశ కార్యకర్తల పోస్టులు భర్తీచేయాలని, అర్హత ఉన్న కార్యకర్తలకు ఏఎన్ఎంలుగా ఉద్యోగోన్నతి ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు పీఎఫ్, ఈఎస్ఐ అమలుచేయాలని డిమాండ్ చేస్తున్నారు. నాణ్యమైన ట్యాబ్‌లు, 5 జీ నెట్ సదుపాయం, పీహెచ్‌సీలు, యూపీహెచ్‌సీల్లో రెస్ట్ రూమ్‌లు ఏర్పాటుచేయాలని పోరాటం సాగిస్తున్నారు.

● పెరిగిన పనిభారం

జిల్లాలో 19 లక్షల జనాభా ఉన్న సమయంలో 1790 ఆశ కార్యకర్తల పోస్టులు ఉండేవి. ఇప్పుడు జిల్లా జనాభా 23 లక్షలకు చేరుకుంది. వీరికి తగ్గట్టుగా ప్రతీ వెయ్యి మందికి ఒక ఆశ కార్యకర్త చొప్పున జిల్లా మొత్తంపై 2,300 మంది ఆశ కార్యకర్తలు ఉండాలి. కొత్త పోస్టుల భర్తీకి చర్యలు తీసుకోకుండా, ఉన్నవారిపైనే పనిభారం పెంచడంపై ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

డిమాండ్లు పరిష్కరించాలి



ఆశ కార్యకర్తలకు పనిభారం అధికంగా ఉంది. కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలి. ఎన్నికల ముందు వేతనాలు పెంచుతామని కూటమి నేతలు హామీ ఇచ్చారు. ఇప్పుడు తాత్సారం చేయడం తగదు.

– బి.పార్వతి, ఆశ కార్యకర్తల సంక్షేమ సంఘం రాజాం నియోజకవర్గ కార్యదర్శి, రాజాం

పని ఒత్తిడి తగ్గించాలి



గ్రామాల్లో బాలింతలు, గర్భిణులకు సేవలందించడంతో పాటు ప్రభుత్వం నిర్వహించే అన్ని కార్యక్రమాల్లోనూ తమతో పనిచేయించుకుంటున్నారు. ఉద్యోగభద్రత మాత్రం కల్పించడం లేదు. కనీస వేతనం అమలుచేయడంలో జాప్యం చేస్తున్నారు. అర్హత ఉన్నవారికి ఉద్యోగోన్నతి కూడా లేదు. ఈ సమస్యలన్నీ ప్రభుత్వం పరిష్కరించాలి.

– డి.సూర్యమణి, ఆశా కార్యకర్తల యూనియన్ రాజాం అధ్యక్షులు

క్లుప్తంగా

సీఐని సస్పెండ్ చేయాలని ఆందోళన



ఎస్.కోట సీఐని సస్పెండ్ చేయాలని ఆందోళన చేస్తున్న నిర్వాసితులు

శృంగవరపుకోట : జిందాల్‌కు కొమ్ము కాస్తూ నిర్వాసితుల పట్ల నిరంకుశంగా వ్యవహరిస్తున్న సీఐని సస్పెండ్ చేయాలంటూ జిందాల్ నిర్వాసితులు శనివారం ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిందాల్‌కు అమ్ముడుపోయిన సీఐ గిరిజన నేతలను ఇబ్బందులు పెట్టటమే కాక, వారి ఇళ్లకు కాని స్టేబుళ్లను పంపి, వేధిస్తున్నారన్నారు. ఇటీవల సత్యనారాయణ రాజు, అప్పలనాయుడులను వేధించటమే కాక, రెండు రోజులు స్టేషన్‌లో ఉంచి, బెదిరింపులకు గురి చేశారని ఆరోపించారు. సీఐ అవినీతి, అక్రమాలను త్వరలోనే బయటపెడతామని పేర్కొన్నారు.

జిందాల్ శిబిరంలో మహిళకు అస్వస్థత



చికిత్స పొందుతున్న శిరగం లక్ష్మి

శృంగవరపుకోట: బొడ్డవరలో జిందాల్ నిర్వాసిత శిబిరంలో నిరసన దీక్షలు చేస్తున్న నిర్వాసితుల్లో అమ్మపాలెం గ్రామానికి చెందిన శిరగం లక్ష్మి శనివారం అకస్మాత్తుగా అస్వస్థతకు గురైంది. దీంతో ఆమెను హుటాహుటిన ఎస్.కోట ఏరియా ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స చేసి, జిల్లా కేంద్రంలో ప్రభుత్వాసుపత్రికి రిఫర్ చేశారు. వైద్యులు సకాలంలో స్పందించటంతో ప్రాణాపాయం తప్పిందని, ఆమె ఆరోగ్యం నిలకడగా ఉందని స్థానికులు తెలిపారు.

దేవుపల్లిలో అక్రమంగా చెట్ల నరికివేత



దేవుపల్లిలో సాగులో ఉన్న మామిడి చెట్లను అక్రమంగా నరికేసిన దృశ్యం

బొండపల్లి: మండలంలోని దేవుపల్లి గ్రామ రెవెన్యూ పరిధిలో కొండవానిపాలెం గ్రామానికి అనుకొని సాగులో ఉన్న మామిడితోటలోని చెట్లు నరికి వేసిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. దీనికి సంబంధించి పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. సర్వే నంబరు 322లోని 6లో పది ఎకరాలు జిరాయితీ పట్టా భూమి ముదునూరు సన్యాసిరాజు, చేకూరి సూర్యకుమారి సాగులో ఉన్న మామిడి చెట్లను శనివారం కొందరు అక్రమంగా నరికేశారు. దీంతో సంబంధిత రైతులు పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ మహేష్‌కు ఫిర్యాదు చేశారు. విశాఖపట్నంలోని పాండురంగాపురం గ్రామానికి చెందిన పైల నటరాజు తమ పొలంలో ఉన్న మామిడి చెట్లను నరికేశాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ విషయమై రెవెన్యూ అధికారులకు కూడా ఫిర్యాదుదారులు తెలిపారు. ఈ విషయమై ఎస్ఐను వివరణ కోరగా మామిడి చెట్ల నరికివేతపై ఫిర్యాదు అందిందని తెలిపారు. క్షేత్రస్థాయిలో దర్యాప్తు చేసి చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఇదే విషయమై తహసీల్దార్ డోలా రాజేశ్వరరావును వివరణ కోరగా తమ దృష్టికి ఈ విషయం రాలేదని వస్తే పరిశీలిస్తామని పేర్కొన్నారు.

వట్టిగెడ్డలో పడి వ్యక్తి మృతి



గేదెల శ్రీనివాసరావు మృతదేహం

వీరఘట్టం: మండలంలోని నడుకూరు గ్రామానికి చెందిన గేదెల శ్రీనివాసరావు(49) స్థానిక వట్టిగెడ్డలో పడి మృతి చెందాడు. మృతుని కుమారుడు దుర్గాప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు ఎస్.ఐ జి.కళాధర్ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. వీరఘట్టం గుండా ప్రవహిస్తున్న వట్టిగెడ్డలో బ్రిడ్జికి దిగువ భాగంలో ఓ మృతదేహం ఉన్నట్టు శనివారం ఉదయం స్థానికులు గుర్తించారు. ఈ విషయాన్ని పోలీసులకు తెలియజేయడంతో ఎస్.ఐ తమ సిబ్బందితో వచ్చి గుర్తు తెలియని మృతదేహం కింద నిర్ధారించి ఒడ్డుకు తీసుకువచ్చారు. మృతదేహాన్ని పాలకొండ ఏరియా ఆసుపత్రికి తరలించారు. అనంతరం మృతుని ఫొటోను సోషల్ మీడియాలో పోస్టు చేశారు. ఈ వ్యక్తి ఎవరికైనా తెలిస్తే సమాచారం ఇవ్వాలని కోరారు. నడుకూరుకు చెందిన కొందరు వ్యక్తులు మృతుని గుర్తించారు. ఇతడు నడుకూరుకు చెందిన గేదెల శ్రీనివాసరావు అని పోలీసులకు తెలియజేశారు. అనంతరం మృతుని కుమారుడు పాలకొండ ఏరియా ఆసుపత్రికి వెళ్లి అక్కడ ఉన్న మృతదేహాన్ని చూసి, చనిపోయినది తన తండ్రే అని పోలీసులకు తెలిపారు. శుక్రవారం సాయంత్రం గెడ్డకు కాలకృత్యాలు తీర్చుకునేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు గెడ్డలో పడిపోయినట్టు నిర్ధారించారు. మృతునికి భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹150	₹270	₹280

వేగుచుక్క.. గురజాడ

- నాటికి.. నేటికీ అజరామరం కన్యాశుల్కం
- నేడు మహాకవి 163వ జయంతి



గురజాడ వేంకట అప్పారావు



గురజాడ స్వగృహం

విజయనగరం టౌన్: విజయనగర ఖ్యాతిని దశ దిశలా చాటిన మహానుభావులు ఎందరో ఉన్నారు. విద్యలనగరమైన విజయనగరంలో సాహితీ సౌరభాలను కురిపించారు. ఆధునిక ఆంధ్ర సాహిత్యంలో వేగుచుక్కలా మెరిసారు. వందల ఏళ్లు దాటినా ఆ సాహితీవేత్తలు అజరామరులే. అటువంటి సాహితీవేత్తలు నడయాడిన నేలపై మనం జన్మించడం మనందరి అదృష్టం. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో గురజాడ 163వ జయంతి ఉత్సవాన్ని ఆదివారం అధికారికంగా నిర్వహించనున్నారు. ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మహాకవి స్వగృహంలో ఉన్న చిత్రపటం వద్ద జ్యోతి ప్రజ్వలన, 9.15 గంటలకు గురజాడ స్వగృహంలో ఉన్న విగ్రహానికి ప్రముఖులతో పూల మాలాలంకరణ చేస్తారు. 9.30 గంటలకు గురజాడ స్వగృహం నుంచి గురజాడ కూడలి వద్ద ఉన్న గురజాడ కాంస్య విగ్రహం వరకూ ఊరేగింపు ఉంటుంది. అనంతరం 9.45 గంటలకు ప్రముఖులతో పూల మాలాలంకరణ ఉంటుంది. దేశమంటే మట్టికాదోయ్,.. సామూహిక దేశభక్తి గీతాలాపన నిర్వహిస్తారు. 10 గంటలకు ప్రముఖుల సందేశాలు, 10.30 గంటలకు వందన సమర్పణ చేయనున్నారు.

మహాకవి గురించి...

సామాజిక సమస్యలపై సాహితీ సమరం పూరించి, విశ్వ సాహితీ వినీలాకాశంలో తెలుగు వెలుగులు విరజిమ్మిన సాహితీ సౌరభం మన మహాకవి గురజాడ వేంకట అప్పారావు. గురజాడ 1862 సెప్టెంబరు 21న రాయవరంలో జన్మించారు. మన మహారాజా విద్యా సంస్థల్లో గిడుగు సహ విద్యార్థిగా మెట్రిక్యులేషన్ పూర్తి చేశారు. తన 23వ ఏట అప్పలనరసమ్మతో వివాహం జరిగింది. ఆయనకు వెంకట రామదాసు, కొండయమ్మలు సంతానం. గురజాడ సమాజంలో రుగ్మతలను రూపు మాపేందుకు కన్యాశుల్కం పేరుతో 1892 ఆగస్టు 13న తొలికూర్పును ప్రదర్శించారు. 1897లో ఆనందగజపతికి అంకితం ఇచ్చారు. రెండో కూర్పును 1909లో ప్రచురించారు. అప్పట్లో సంస్కృత భాషకు ఆదరణ ఎక్కువగా ఉండేది. ముత్యాలసరాలు రచించి సామాన్యునికి అర్థమయ్యే విధంగా రచనలు చేశారు. 1883లో సారంగధర, డామిట్ కథ అడ్డం తిరిగింది, పుత్తడిబొమ్మ పూర్ణమ్మ, లవణరాజు కల, నీలగిరి పాటలు, కాసులు, బిల్హణీయం, కన్యక, సుభద్ర, దించు, లంగరు తదితర ఎన్నో అద్భుతమైన రచనలు చేశారు. అన్నింటి కన్నా ఎవరూ రాయలేని దేశభక్తి గేయాన్ని ఆయన 'దేశమును ప్రేమించుమన్నా..' అంటూ రాసి విమర్శకుల ప్రశంసలు పొందారు. రాజా వారి కోర్టు దావాలలో ఎడతెరిపి లేకుండా ఆ భారాన్నంతా తన భుజాన్ని వేసుకుని పనులు చేశారు. అప్పటికే ఆయన ఆరోగ్యం బాగా క్షీణించింది. 1915 నవంబరు 30న ఉదయం 8.20 గంటలకు ఆ మహనీయుడు కన్ను మూశారు.

అందరి సహకారంతో గంజాయిపై ఉక్కుపాదం మోపాం

- వీడ్కోలు సభలో ఎస్పీ వకుల్ జిందల్



ఎస్పీ వకుల్ జిందల్‌కు వీడ్కోలు పలుకుతున్న దృశ్యం

విజయనగరం క్రైమ్ : ప్రతీ ఒక్కరి సహకారంతోనే గంజాయిపై ఉక్కు పాదం మోపామని గుంటూరు జిల్లాకు బదిలీ అయిన ఎస్పీ వకుల్ జిందల్ అన్నారు. విజయనగరం పోలీసు బ్యారెక్స్‌లో ఎస్పీ వకుల్ జిందల్ వీడ్కోలు కార్యక్రమం పోలీసు శాఖ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా ఆర్మ్‌డ్ రిజర్వు, సివిల్ పోలీసు అధికారులు, సిబ్బంది సమన్వయంతో పని చేసి అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేశామన్నారు. జిల్లా ప్రజలు, అధికారులు, సిబ్బందిని విడిచి వెళ్లడం బాధగా ఉందన్నారు. జిల్లాలో గంజాయి మూలాలను సమూలంగా నాశనం చేశామని, గంజాయి అక్రమ రవాణాకు పాల్పడిన వ్యక్తులను అరెస్టు చేసి, వారి ఆస్తులను కూడా అటాచ్ చేశామన్నారు. బాలలపై జరిగే అఘాయిత్యాలకు పాల్పడిన వారిపై నమోదైన కేసుల్లో నిందితులకు ఆరు మాసాల్లోనే శిక్షలు పడే విధంగా చర్యలు చేపట్టామన్నారు. సైబర్ నేరాల కట్టడికి సమర్థవంతంగా పని చేశామన్నారు. తన విధి నిర్వహణలో అందించిన సహకారం మరువలేనన్నారు. అనంతరం ఎస్పీ వకుల్ జిందల్‌ను దుశ్శాలువతో సత్కరించి, జ్ఞాపికను అందించారు. అనంతరం ఎస్పీ జిందల్‌ను ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో ఆత్మీయ వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీలు పి.సౌమ్యలత, జి.నాగేశ్వరరావు, డీఎస్పీ ఆర్.గోవిందరావు, ఎం.వీరకుమార్, పలువురు రిజర్వు ఇన్‌స్పెక్టర్లు, సీఐలు, ఆర్ఎస్ఐలు, ఆర్మ్‌డ్ రిజర్వు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ చెట్లను దత్తత తీసుకోవాలి

- టెర్రస్ గార్డెన్‌ను ప్రోత్సహించండి
- కలెక్టర్ ఎస్.రామసుందరరెడ్డి



నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో సర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రలో భాగంగా రింగురోడ్డు మున్సిపల్ పార్కులో మొక్కను నాటి నీరు పోస్తున్న కలెక్టర్ రామసుందరరెడ్డి

విజయనగరం: ప్రతి ఒక్కరూ చెట్లను పెంచి దత్తత తీసుకోవాలని, వీలు కాని పక్షంలో టెర్రస్ గార్డెన్‌ను ప్రోత్సహించాలని కలెక్టర్ ఎస్.రామసుందరరెడ్డి సూచించారు. స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా రింగ్ రోడ్డు వద్ద మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, చెట్ల సంరక్షణలో రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్‌లు, పాఠశాలలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. చెట్లు నరికివేయడం వలన పర్యావరణ కాలుష్యం పెరుగుతోందని, పచ్చదనం పెంపొందించకపోతే భవిష్యత్తు తరాలు తీవ్రమైన సమస్యలు ఎదుర్కోవలసి వస్తుందని హెచ్చరించారు. మొక్కలు నాటడంలో ప్రజల భాగస్వామ్యం అత్యంత అవసరమని కలెక్టర్ తెలిపారు. క్వాలిటీ లైఫ్ కోసం మొక్కలు అనివార్యం అని ఆయన వివరించారు. స్థలం లేని ప్రాంతాలలో టెర్రస్ గార్డెనింగ్‌ను ప్రోత్సహించాలని సూచించారు. టెర్రస్ గార్డెన్ ద్వారా ఇంట్లోకి అవసరమైన కూరగాయలు పండించుకోవచ్చని, ప్రకృతికి అవసరమైన పచ్చదనం పెరుగుతుందని, మొక్కలకు సేవ చేయడం ద్వారా శారీరక శ్రమతో ఆరోగ్యం మెరుగుపడుతుందని, ఇంటి వ్యర్థాలతో సహజ ఎరువులు తయారు చేయవచ్చని కలెక్టర్ వివరించారు. స్థానిక కార్పొరేటర్ లక్ష్మణరావు మాట్లాడుతూ మొక్కలను నాటడమే కాకుండా, వాటి సంరక్షణ బాధ్యతను చేపట్టాలని కోరారు. ముందుగా అక్కడ ఉన్న పార్కులో కలెక్టర్ ఇతర అధికారులు మొక్కలు నాటారు. అనంతరం స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర ప్రతిజ్ఞలో పాల్గొని జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. కూడలి వద్ద మానవహారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ నల్లనయ్య, జిల్లా పరిషత్ సీఈవో డి.సత్యనారాయణ, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె.సాంబమూర్తి, ఈఈ పీఎస్‌వీవీ ప్రసాద్, డీఈఈ శ్రీనివాసరావు, ఏసీపీలు రమణమూర్తి, హరిబాబు, మెప్మా పీడీ చిట్టిబాబు, తహసీల్దార్ కూర్మనాథ్ తదితరులు పాల్గొన్నారు.

7న చలో విజయవాడ

- మహాధర్నాకు తరలిరండి
- ఫ్యాప్టో జిల్లా ఛైర్మన్ పాలతేరు శ్రీనివాసరావు పిలుపు



మలిచర్ల ఉన్నత పాఠశాల ప్రాంగణంలో నిరసన కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు

విజయనగరం అర్బన్: రాష్ట్ర ఫ్యాప్టో పిలుపు మేరకు అక్టోబర్ 7న విజయవాడలో నిర్వహించనున్న మహాధర్నాకు జిల్లా నుంచి ఉపాధ్యాయులు తరలి రావాలని జిల్లా ఫ్యాప్టో చైర్మన్ పాలతేరు శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. మలిచర్ల క్లస్టర్ కాంప్లెక్స్‌లో శనివారం జరిగిన కార్యక్రమం అనంతరం ఆయన మహాధర్నాకు సంబంధించిన పోస్టర్‌ను విడుదల చేశారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం అందరూ ఏకతాటిపైకి రావాలని పిలుపునిచ్చారు. సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ధ్వజమెత్తారు. చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

వృద్ధ దంపతుల బలవన్మరణం

- అనారోగ్యంతో అష్టకష్టాలు
- పిల్లలకు భారం కాకూడదని ఆత్మహత్య



ఆత్మహత్యకు పాల్పడిన సత్యనారాయణ, పార్వతి దంపతులు

విజయనగరం క్రైమ్: పిల్లలకు పెళ్లిళ్లు చేసిన ఆ వృద్ధ దంపతులు తమకొచ్చిన అనారోగ్యంతో వారికి భారం కాకూడదు అనుకున్నారు. దీంతో బలన్మరణానికి పాల్పడ్డారు. దీనికి సంబంధించిన వివరాలు విజయనగరం రూరల్ ఎస్ఐ అశోక్‌కుమార్ వెల్లడించారు. రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధి వీటీ అగ్రహారానికి చెందిన కానూరి సత్యనారాయణ(60), భార్య కానూరి పార్వతి(54) వై జంక్షన్ వద్ద ఓ టిఫిన్ సెంటర్ పెట్టుకుని కుటుంబాన్ని నెట్టుకొస్తున్నారు. వీరికి ఓ అబ్బాయి, అమ్మాయి ఉండగా ఇద్దరికీ పెళ్లి చేసేశారు. అబ్బాయి రమేష్‌తోనే కొన్నాళ్లుగా వై జంక్షన్‌లో టిఫిన్ దుకాణం నడుపుతున్నారు. ఇంతలోనే ఇద్దరూ అనారోగ్యం బారిన పడ్డారు. సత్యనారాయణ మానసిక వ్యాధితో, పార్వతి ఫిట్స్‌తో బాధ పడుతుండేవారు. ఈ సమస్యలు కుటుంబాన్ని కుదిపేస్తున్నాయి. ఓ వైపు ఆసుపత్రి ఖర్చులు, మరో వైపు పిల్లలపై ఆధారపడ్డాం అన్న బాధ వారిని కృంగదీసింది. ఆ బాధలను నెగ్గలేక, పోరాటం చేయలేక ఇద్దరూ పురుగుల మందు తీసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు రూరల్ ఎస్ఐ అశోక్ కేసు నమోదు చేశారు. ఇద్దరి మృతదేహాలను సర్వజన ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

28న మిస్టర్ ఆంధ్ర బాడీ బిల్డింగ్ పోటీలు

- హాజరు కానున్న 250 మంది క్రీడాకారులు
- ట్రోఫీలను ఆవిష్కరించిన మాజీ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల



మిస్టర్ ఆంధ్ర బాడీ బిల్డింగ్ చాంపియన్‌షిప్ ఆంధ్ర ట్రోఫీని ఆవిష్కరిస్తున్న మాజీ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: జిల్లా వేదికగా రాష్ట్ర స్థాయి మిస్టర్ ఆంధ్రా బాడీ బిల్డింగ్ పోటీలు నిర్వహించటం మంచి పరిణామమని, క్రీడలకు, క్రీడాకారులకు తమ వంతు ప్రోత్సాహం ఎల్లప్పుడూ ఉంటుందని ఏపీ శాసనసభా మాజీ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి పేర్కొన్నారు. ఈ నెల 28న నగరంలోని ఆనందగజపతి కళాక్షేత్రం వేదికగా నిర్వహించ తలపెట్టిన కనకల ఎర్రయ్య మెమోరియల్ మిస్టర్ ఆంధ్రా బాడీ బిల్డింగ్ పోటీల ట్రోఫీలను ఆయన తన నివాసంలో శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోడి రామమూర్తి స్ఫూర్తితో గత 11 సంవత్సరాలుగా నిర్వహిస్తున్న బాడీ బిల్డింగ్ పోటీలు విజయవంతం కావాలని ఆకాంక్షించారు. క్రీడలతో శారీరక, మానసిక ధృడత్వం కలుగుతుందని ప్రతి ఒక్కరు ఆ దిశగా తమ పిల్లలను ప్రోత్సహించాలని కోరారు. రాష్ట్ర స్థాయి పోటీలకు హాజరయ్యే వివిధ జిల్లాల క్రీడాకారులకు మంచి ఏర్పాట్లు చేసి విజయనగరం ప్రతిష్టను చాటి చెప్పాలని ఆకాంక్షించారు. బాడీ బిల్డింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు కనకల కృష్ణ మాట్లాడుతూ కనకల ఎర్రయ్య మెమోరియల్ పేరిట ఈ ఏడాది 12వ మిస్టర్ ఆంధ్రా బాడీ బిల్డింగ్ పోటీలు నిర్వహించనున్నట్టు చెప్పారు. గతేడాది నిర్వహించిన పోటీలకు 182 మంది క్రీడాకారులు హాజరు కాగా... ఈ ఏడాది సుమారు 250 మంది హాజరయ్యే అవకాశం ఉందన్నారు. దసరా, పైడితల్లమ్మ వారి ఉత్సవాల సందర్భంగా ఈ పోటీలు నిర్వహిస్తున్నామని చెప్పారు. పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి రూ.1.30 లక్షల నగదు ప్రోత్సాహకాన్ని అందజేయనున్నట్టు వివరించారు. ఈ పోటీల్లో క్రీడాకారులు, క్రీడా సంఘాల ప్రతినిధులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు బైక్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

యోగా పోటీ విజేతలుగా పట్టణ విద్యార్థులు



విజేతలను అభినందిస్తున్న అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ మజ్జి శశిభూషణరావు

విజయనగరం అర్బన్: తాడేపల్లిగూడెం, పత్తిపాడు ప్రాంతాల్లో ఇటీవల జరిగిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర యోగా స్పోర్ట్స్ అసోసియేషన్-2025 చాంపియన్‌షిప్‌లో విజయనగరం జిల్లా విద్యార్థులు 13 మంది పతకాలు సాధించారు. ఈ మేరకు యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ మజ్జి శశిభూషణరావు శనివారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. వీరిలో గౌరీనాయుడు, పైడిరాజు బంగారు పతకం, గౌరీనాయుడు వెండి పతకం, జి.కిషోర్‌కుమార్ వెండి పతకం దక్కించుకున్నారు. పైడిరాజు, బార్నాల పావని, తుపాకుల రీతూ కాంస్య పతకాలు సాధించారు. బంగారు పతకాలు సాధించిన క్రీడాకారులు విజయవాడలో జరిగే 6వ జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించారని జిల్లా జనరల్ సెక్రటరీ వడ్లమాని నరసింహమూర్తి తెలిపారు.

గురుదేవా సేవలు దివ్యాంగులకు వరం

- విర్ఫో ఫౌండేషన్ జీఎం టి.ప్రవీణ



దివ్యాంగులకు కృత్రిమ అవయవాలను అందజేస్తున్న విర్ఫో ఫౌండేషన్ జీఎం ప్రవీణ తదితరులు

కొత్తవలస : మండలంలోని మంగళపాలెం గ్రామం సమీపంలో గల గురుదేవా చారిటబుల్ ట్రస్టు సేవలు దివ్యాంగులకు వరం లాంటివని విర్ఫో ఫౌండేషన్ జీఎం టి.ప్రవీణ అన్నారు. విర్ఫో ఫౌండేషన్ సహకారంతో ట్రస్టు ఆధ్వర్యంలో 50 మంది దివ్యాంగులకు కృత్రిమ అవయవాలు, వినికిడి యంత్రాలు, చేతి కర్రలు తదితర సామగ్రిని ట్రస్టు ఆవరణలో శనివారం అందజేశారు. కార్యక్రమంలో టి.ప్రవీణ మాట్లాడుతూ మారుమూల గ్రామంలో స్థాపించబడిన గురుదేవా చారిటబుల్ ట్రస్టు సేవలు ఆరు రాష్ట్రాలకు విస్తరించాయని కొనియాడారు. వివిధ ప్రమాదాల్లో అవయవాలను కోల్పోయి జీవచ్ఛవంలా బ్రతికే క్షతగాత్రులకు కృత్రిమ అవయవాలను అమర్చి కొత్త జీవితాన్ని ప్రసాదిస్తోందన్నారు. ట్రస్టు ఆధ్వర్యంలో ఇప్పటికే వందల మందికి కృత్రిమ అవయవాలను అందించడంలో భాగస్వామ్యం అయినట్లు పేర్కొన్నారు. అనంతరం ట్రస్టు చైర్మన్ రాపర్తి జగదీష్‌బాబు మాట్లాడుతూ దేశంలోనే అతి తక్కువ ఖర్చుతో కృత్రిమ అవయవాలను తయారు చేసి ఉచితంగా అందజేస్తున్నట్టు తెలిపారు. ఆరు రాష్ట్రాల్లో ఇప్పటి వరకు సుమారు 2లక్షల మందికి కృత్రిమ చేతులు, కాళ్లను అందజేశామన్నారు. కార్యక్రమంలో పలువురు ట్రస్టు సభ్యులు, విర్ఫో ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

డివైడర్ ఎక్కిన గ్రానైట్ లారీ



డివైడర్ ఎక్కిన లారీ

సీతంపేట: స్థానిక ఐటీడీఏ సమీపంలో కొత్తూరు-సీతంపేట రహదారి మధ్య ఉన్న డివైడర్‌పై ఓ గ్రానైట్ లారీ ఎక్కేసింది. శుక్రవారం అర్ధరాత్రి ఈ సంఘటన చోటుచేసుకుంది. లారీపైన ఉన్న గ్రానైట్ రాయి కింద పడకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. డ్రైవర్‌కు స్వల్ప గాయాలైనట్టు సమాచారం. గడిగుడ్డి నుంచి సీతంపేట ఐటీడీఏ వరకు డివైడర్ పై ఉన్న సెంటర్ లైటింగ్ వెలగకపోవడం, డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా ప్రమాదం జరిగింది. ఒక విద్యుత్ స్తంభాన్ని కూడా బలంగా ఢీకొట్టడంతో కింద పడింది.

వీర మహిళలను ఆపేదెవడ్రా..!

- జనసేన వీర మహిళల మధ్య కుల దూషణ కేసు



డీఎస్పీ కార్యాలయం వద్ద మాట్లాడుతున్న సీపీఐ నాయకులు, బాధితురాలు

బొబ్బిలి: సమాజంలో కులదూషణ, అణచివేతను ప్రశ్నించేందుకు వచ్చిన జనసేన పార్టీలో వీర మహిళలే కుల దూషణ కేసుపై పోలీసుస్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేసుకోవడం నియోజకవర్గంలో చర్చనీయాంశమైంది. జనసేన మహిళపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు కావడంతోనే కాదని, వెంటనే ఆమెను అరెస్టు చేయాలని బాధితురాలు కోరుకుంటోంది. పోలీసు ఫిర్యాదును అనుసరించి జరిగిన విషయం ఏమిటంటే.. బొబ్బిలి జనసేన పార్టీలో వీర మహిళగా గత ఎనిమిదేళ్లుగా పని చేస్తున్న బిగులు లక్ష్మి తనను స్థానిక ఫూల్‌బాగ్‌లో ఉంటున్న మరో వీరమహిళ ఎస్సీ కులం పేరుతో పలుమార్లు దూషిస్తోందని, తనకు పదవి ఇస్తే ఇటువంటి వారికి కూడా పదవులిస్తారా.. అని కులం పేరుతో దూషిస్తోందని సమాజంలో తనను అందరూ చిన్న చూపు చూస్తున్నారని ఈ నెల 13న స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అంతే కాదు మండలంలోని పారాదిలో గతంలో దేవాలయ ప్రతిష్ఠ కోసం స్థానికులు తనను ఆహ్వానిస్తే ఇటువంటి వారిని ఎవరు ఆహ్వానించారు..? తక్కువ కులానికి చెందిన వారిని ఆహ్వానిస్తే మైల పడతాం అని అందని ఫిర్యాదులో లక్ష్మి పేర్కొంది. అలాగే పార్టీ కార్యక్రమాల్లో పాల్గొని నాయకులు, కార్యకర్తలతో మాట్లాడితే అటువంటి వారితో మాట్లాడకండని అందరిలో అవహేళన చేస్తోందని బిగులు లక్ష్మి వాపోయింది. అంతేకాదు తన కులం గూర్చి దూషిస్తూ, అవమాన పరుస్తూ సోషల్ మీడియా గ్రూపుల్లో పోస్టులు పెట్టిందని చెప్పింది. ఇటీవల ఉచిత బస్సు ప్రారంభోత్సవం సమయంలో ఎమ్మెల్యే బేబీ నాయనతో తీసుకున్న ఫొటోను తెలుగు మహిళ గ్రూపులో తాను పోస్టు చేయగా దానిపైనా విమర్శలు చేసి డిలీట్ చేసిందన్నారు. ఈ స్క్రీన్ షాట్లను కూడా సమర్పిస్తున్నట్టు పోలీసులకు తెలియజేసింది బాధితురాలు. ఆమెపై చర్య తీసుకోవాలని తనకు ప్రాణహాని కూడా ఉందని ఫిర్యాదులో పేర్కొంది. కొసమెరుపేంటంటే...బాధితురాలు ప్రజా సంకల్ప వేదిక మానవ హక్కుల సంఘం జిల్లా కార్యదర్శి.

అరెస్టు చేయాలి..

కులం పేరుతో దూషించిన మహిళను వెంటనే అరెస్టు చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కోట అప్పన్న డిమాండ్ చేశారు. డీఎస్పీ కార్యాలయం ఎదుట బాధితురాలితో కలసి సీపీఐ నాయకులు మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి ఇన్నేళ్లయినా ఇంకా కులం పేరుతో కొన్ని వర్గాలను అణచివేసే ధోరణి ఉండటం దారుణమన్నారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినప్పటికీ ఆమెను ఇంకా అరెస్టు చేయకపోవడం దారుణమన్నారు. నాయకులు రాకోటి నాగమ్మ, వై.బాబ్జీలతో పాటు బాధితురాలు బిగులు లక్ష్మి ఉన్నారు.

దర్యాప్తులో ఉంది

జనసేన పార్టీలో మహిళ తనను కులం పేరుతో దూషించిన బంటుపల్లి దివ్యపై ఆరోపణలు చేస్తూ ఫిర్యాదు చేశారు. దీనిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైంది. డీఎస్పీ జి.భవ్యారెడ్డి దర్యాప్తు చేస్తున్నారు.

– సతీష్ కుమార్, సీఐ, బొబ్బిలి